ఉద్యమ ఆశయాల సాధన కోసం కొట్లాడుతూనే ఉంటాం

విశ్వంభర, హైదరాబాద్ : గత ప్రభుత్వం పదేండ్లలో ఒక్కరోజు కూడా ఉద్యమకారుల గురించి ఆలోచించలేదు అని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ అంటేనే కోట్లాదిమంది ఆకాంక్ష, వేలాది మంది త్యాగం అని చెప్పారు. శనివారము సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉద్యమకారుల గుర్తింపు సంక్షేమంపై చర్చా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ 2014 లో కేసిఆర్ అధికారం లో రావడానికి మనందరి పోరాటం కృషి ఉంది. కానీ మన బాధలను చెప్పుకోవడానికి అవకాశం ఇవ్వలేదని, తెలంగాణ కోసం కొట్లాడింది మేమే అని మా వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని చెప్పుకున్నారని తెలిపారు .మిలియన్ మార్చ్ రోజు సందర్భముగా 2016 లో ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటామని అంటే ట్యాంక్ బండ్ మీదకు వెళ్ళటానికి పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు.ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం కూడా తప్పు అన్నట్టు ఆనాటి నాయకులు ప్రవర్తించారని విమర్శించారు. తెలంగాణ అంటే నీళ్లు, నిధులు, నియామకాలు అలాంటి వాటి కోసం మాట్లాడితే కేసులు పెట్టి అరెస్ట్ చేసి ఇబ్బందిలు పెట్టారన్నారు.

తెలంగాణ లో మార్పు కోసం పోరాటం చేసామని తెలిపారు. నేడు తెలంగాణ ఉద్యమం ఆకాంక్షల కోసం మాట్లాడటం కోసం మనకు వెసులు బాటు వచ్చిందన్నారు.ప్రభుత్వం ఉద్యమ కారుల గుర్తింపు కోసం కమిటీ ఏర్పాటుచేసిందని ఈ కమిటీ అందరికీ న్యాయం చేసే విధంగా పని చేస్తుందని తెలిపారు.

ఆనాడు తెలంగాణ కోసం ఎలా పోరాటం చేశామో మళ్లీ ఇప్పుడు తెలంగాణ ఉద్యమ ఆశయ సాధనకు పోరాటం చేద్దాం అని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ ఆశయాల సాధన కోసం ఎప్పుడు కొట్లాడుతూనే ఉంటానని కోదండరాం అన్నారు . తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల గుర్తింపు కోసం కమిటీని ఏర్పాటు చేశారు అని ఆ కమిటీలో సభ్యులుగా మాకు భాగస్వామ్యం కల్పించారని అన్నారు. మేమందరం కలిసి పని చేసి అందరినీ గుర్తించి వారికి తగిన గౌరవం న్యాయం జరిగేలా కృషి చేస్తామని అన్నారు. జూన్ 4న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి సలహాలు, సూచనలు తీసుకుంటామని తెలిపారు.తెలంగాణ సచివాలయం ముందు గల అమర జ్యోతి లో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని శనివారం జరిగిన సమావేశాల్లో నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు గుర్తింపు కోసం కమిటీని ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యమకారులు ప్రభుత్వం ను అడుగుతున్నది భిక్ష కాదు అని మన హక్కు అని అన్నారు. ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వడం అంటే తెలంగాణ చరిత్రను గౌరవించడమే అని అన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ కాగితాలకే పరిమితం కాకుండా, కాలయాపన చేయకుండా ఉద్యమకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యమకారునికి న్యాయం చేసేందుకు అన్ని సంఘాలతో కలుపుకొని తెలంగాణ ఉద్యమకారుల సంఘం పోరాట చేసిందన్నారు. ముఖ్యంగా ఉద్యమకారులకు గౌరవప్రదమైన 250 గజాల స్థలం, హెల్త్ కార్డు, పెన్షన్, గుర్తింపు కార్డుతో పాటు బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. 2014 లో ఉద్యమ కారుల సంక్షేమ సంఘం స్థాపించి, ఇప్పటికే ఉద్యమకారులను గుర్తించి తమ సంఘం నుండి గుర్తింపు పత్రాలు ఇచ్చి భరోసా ఇచ్చామని అన్నారు. మా సంఘం ఏకైక లక్ష్యం ఉద్యమకారులకు న్యాయం చేయడం అని అన్నారు. తెలంగాణా ఉద్యమం లో పాల్గొన్న వారందరూ ప్రభుత్వం మాకేదే చేస్తుందో అని ఆశించి పని చేయలేదని తెలిపారు. ఎల్బీ నగర్ లో శ్రీకాంత చారి ఆత్మార్పణ తో తెలంగాణ ఉద్యమం ఊపందుకుంది అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనాలతో ఎన్ని కేసులు పెట్టినా వాటికి బెదరకుండా ప్రత్యేక రాష్ట్రం కోసమే జే ఏ సి ఇచ్చిన పిలుపు మేరకు మేము పోరాటం చేశామని అన్నారు. కానీ తెలంగాణ ఉద్యమ కారులకు న్యాయం జరగాలంటే జుడీషియల్ కమిటీ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ప్రభుత్వం మీరు ఇచ్చే ఆర్థిక సహాయం కోసం మేము ఉద్యమం లో పోరాటం చేయలేదన్నారు. కేవలం మేము చేసిన పోరాటానికి తగిన గుర్తింపు కోసమే మా ఆరాటం అని తెలిపారు.హైదరాబాద్ లో పనిచేసిన ఉద్యమకారుల కోసం ఫ్యూచర్ సిటీ లో 1000 ఎకరాల భూమి ఉద్యమకారులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా వెంటనే వాటిని ఆచరణలో పెట్టి ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు .లేని పక్షంలో తెలంగాణ ఉద్యమకారుల ఆశయాల సాధన కోసం తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో మరో పోరాటానికి సిద్ధం అని తెలిపారు. మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ కారులను గుర్తించేందుకు ప్రభుత్వం నియమించిన కమిటీలో మాకు స్థానం కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.సచివాలయం లో జరిగిన సమావేశం సందర్భంగా ఈ నెల 4 న అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి వారి సలహాలు సూచనలు స్వీకరించాలని నిర్ణయించారు.. ఉద్యమం లో పని చేసిన ప్రతి ఒక్కరికి కూడా న్యాయం జరిగేలా చూడాలను సీఎం రేవంత్ రెడ్డిసూచనలకు అనుగుణంగా అందరి అభిప్రాయాలు తీసుకుని ముందుకు వెళ్తామని అన్నారు.అనంతరం మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ మాట్లాడుతూ కేసు లే ప్రాతిపదిక న్యాయమైన ప్రమాణం కాదు అని అన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయిలోకి వెళ్లి ఉద్యమకారులను గుర్తిస్తాం అని అన్నారు. ఏ ఒక్క ఉద్యమకారునికి అన్యాయం జరగదని, అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పదేండ్ల పాలనలో ఉద్యమకారులు చెట్టుకొకరు పుట్టకొకరు అయ్యారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితోటే ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఆ కమిటీలో నన్ను భాగస్వామ్యం చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కేసులే ప్రాతిపాదికనా అయితే నాపై ఒక్క కేసు కూడా లేదన్నారు. ఉద్యమం లో పాల్గొన్న ఉద్యమకా రులకు సంబంధించిన కేసులు ఎఫ్ ఐ ఆర్ కాకుండా ఉద్యమకారులందరికీ న్యాయం జరిగే చూస్తానని తెలిపారు . ఈ కార్యక్రమంలో పాశం యాదగిరి, మాజీ చైర్మన్ ముక్కాల సాంబశివరావు, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు కె.వి రంగారెడ్డి, పల్లె వినయ్ కుమార్, శ్రవణ్ కుమార్ గుప్తా, బిరెల్లి వెంకటరెడ్డి, కొత్తరవికుమార్, మహేందర్ యాదవ్, కూర రమేష్ , శ్రీధర్, శ్రీకాంత్ చారి తండ్రి వెంకటాచారి, సువర్ణ , తెలంగాణ వ్యాప్తంగా ఉన్న 1969 ఉద్యమకారులు, మలిదశ ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం

విశ్వంభర, సరూర్ నగర్ : రాష్ట్ర ఐ. టి. శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పుట్టినరోజు సందర్భంగా పి .వి నరసింహారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ లో నిర్వహించిన బ్లడ్ డొనేషన క్యాంపు నిర్వహించిన రక్తదాన కార్యక్రమానికి బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవ రాజు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సమాజములో రక్తము చాలా అవసరం, ఇలాంటి కార్యక్రమాలు ప్రతి రోజు ఎక్కడో ఒకచోట బ్లడ్ డొనేషన్ క్యాంపులు యువత చేపట్టాలని అయన అన్నారు. ఈ క్యాంపులు నిర్వహించిన దడిగం సుధాకర్ శర్మ ని వక్కలంక స్వరూప్ రాజ్, చరణ్ గౌడ్, ఆలూరిని ఆయన అభినందించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు మాట్లాడుతూ రక్తదానం శిభిరాలకు యువత ముందుకు వచ్చి రక్తాన్ని డొనేషన్ రూపములో అందజేయడం ఎంతో అవసరము అన్నారు. ఈకార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సుధాకరన్ మాటాడుతు ఎవరు ఎప్పుడు బ్లడ్ డొనేషన ఇవ్వాలనుకున్న మా చారిటబుల్ ట్రస్ట్కి రావచ్చని ఎక్కడైనా ఏర్పాట్లు చేసుకున్న మాసహాయ సకరాలు ఉంటాయని అన్నారు. బ్లడ్ దాతలు శ్రీపాదరావు, సంతోష్ రెడ్డి, బాలకృష్ణ, 40 మంది వరకు రక్తదానం చేసారు. ఈ కార్యక్రమములో గోపికృష్ణమాచార్యులు, మురళి, నాగరాజు, రాజు, బాలాభాస్కర్, నారాయణన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జీవితం అందరికీ ఆదర్శం

విశ్వంభర, చిక్కడపల్లి : ఎన్టీఆర్ జీవితం అందరికీ ఆదర్శం అని టి పీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ , రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. చిక్కడపల్లి ప్రాంతంలోని వేంద్ర ఏడుకొండలరావు, ఎం.ఎ. సెవెన్ హిల్విశ్వంభ ఆర్గనైజేషన్ అధ్యక్షులు సినీ, టీవీ డబ్బింగ్ డైరెక్టర్ శ్రీ త్యాగరాయ గానసభ వేదికగా సెవెన్ హిల్స్ సంస్థ ఆధ్వర్యంలో "ఎన్టీఆర్ అవార్డ్స్ ఘంటసాల అవార్డ్స్" కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. తెలుగు సినీ, సాంస్కృతిక రంగాలకు విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్త అవార్డు గ్రహీతలకు ఎన్టీఆర్ అవార్డులను ప్రదానం చేసి అభినందనలు తెలిపారు. మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానటుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు సేవలు చిరస్మరణీయమని అన్నారు. సినీరంగంలోనే కాకుండా ప్రజా సేవలోనూ ఎన్టీఆర్ చూపిన మార్గం తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు చేరవేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు రుద్రరాజు పద్మరాజు ,డా. చింది బద్రీనాథ్ , కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి , కటకం భాస్కర్ గుప్తా, సినీ రంగానికి చెందిన ప్రముఖులు, సామాజిక సేవకులు, అభిమానులు పాల్గొన్నారు.

గరిడేపల్లిలో కొట్టుకున్న ప్రభుత్వ ఉద్యోగులు

విశ్వంభర, గరిడేపల్లి : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల మధ్య వివాదం చోటు చేసుకుంది. మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌ను తన పని పూర్తి చేయకుండా వెళ్లవద్దంటూ మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి అడ్డుకున్నాడు. సీనియర్ అసిస్టెంట్ తన కారులో వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, మండలంలోని ఓ గిరిజన తండాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి కారుకు అడ్డంగా నిలబడి వెళ్లకుండా అడ్డుకున్నాడు. దీంతో ఆగ్రహించిన సీనియర్ అసిస్టెంట్ కారు నుంచి దిగి వచ్చి కార్యదర్శిపై చేయి చేసుకున్నాడు. ఈ ఘటనతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. అక్కడే ఉన్న సహోద్యోగులు జోక్యం చేసుకుని వారిని విడదీశారు. ఈ సంఘటన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అందరూ చూస్తుండగానే జరిగింది. మండలంలోని ఓ గిరిజన తండాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శి తన సర్వీస్ బుక్‌లో తాళ్ల మల్కాపురం గ్రామపంచాయతీకి సంబంధించి జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలు, ఎంపీడీవో ఇచ్చిన జాయినింగ్ ఆర్డర్, లక్ష తండా జాయినింగ్ ఆర్డర్ వివరాలను నమోదు చేయకుండా సీనియర్ అసిస్టెంట్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించాడు. గత మూడు సంవత్సరాలుగా ఎన్నిసార్లు వేడుకున్నప్పటికీ తన సర్వీస్ బుక్‌లో ఎంట్రీలు చేయకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేసేందుకు లంచం అడిగాడని, ఆ డబ్బులు కూడా ఇస్తానని ఒప్పుకున్నప్పటికీ నమోదు చేయలేదని ఆరోపించాడు. ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్ గరిడేపల్లి నుంచి జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ అయ్యాడు. దీంతో తన సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు చేసి వెళ్లాలని కోరుతూ కార్యదర్శి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అతని కారును అడ్డుకున్నాడు. సర్వీస్ బుక్‌లో వివరాలు నమోదు కాకపోతే భవిష్యత్తులో తనకు సీనియారిటీ, ప్రమోషన్లపై ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు. కార్యాలయం నుంచి వెళ్తున్న సీనియర్ అసిస్టెంట్ కారుకు అడ్డుగా నిలబడి వెళ్లనివ్వకుండా చేయడంతో, అతడు కారు దిగి వచ్చి కార్యదర్శిపై చేయి చేసుకున్నాడు. సహోద్యోగులు వారిస్తున్నప్పటికీ ఇద్దరి మధ్య ఘర్షణ కొనసాగింది. కార్యదర్శిపై చేయి చేసుకోవడంతో వివాదం మరింత ముదిరింది. ఇద్దరు ఉద్యోగులు కార్యాలయ ఆవరణలోనే కొట్టుకోవడం చూసిన స్థానికులు ఆశ్చర్యానికి గురయ్యారు. సమస్యను కార్యాలయం లోపలే పరిష్కరించుకోవాల్సిన ఉద్యోగులు బహిరంగంగా గొడవ పడడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన వారు అందరూ చూస్తుండగానే ఘర్షణకు దిగడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానించారు. గరిడేపల్లి మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయ ఆవరణలో ఘర్షణకు దిగడం స్థానికంగా సంచలనంగా మారింది.

పేదలతో గుడిసెలు వేయించి.. రూ.కోట్ల విలువైన భూమి కబ్జాకు రియల్టర్ల యత్నం

విశ్వంభర, హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడనార్సింగి గ్రామాల పరిధిలో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. ముష్మిన్ చెరువు అభివృద్ధి పేరుతో చేస్తున్న కబ్జాలకు చెక్ పెట్టింది. చెరువులో.. రూ.5,500 కోట్ల విలువైన కబ్జాలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తోంది. హెచ్ఎండీఏ లెక్కల ప్రకారం చెరువు 52.20 ఎకరాల పరిధిలో ఉండగా.. చెరువు మధ్యలోంచి కట్ట నిర్మించి 34.21 ఎకరాలు కబ్జా చేసే ప్రయత్నం జరిగిందని హైడ్రా పేర్కొంది.సీఎస్ఆర్ నిధులతో చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన నిర్మాణ సంస్థ.. అభివృద్ధి మాటున కబ్జాకు ప్రయత్నించింది. గ్రామ రికార్డుల ప్రకారం చెరువు పరిధి 59.11 ఎకరాలు కాగా.. ఇందులో ప్రభుత్వ శిఖం 20.23 ఎకరాలు, మిగతా అంతా పట్టా భూమి. అక్కడ ఎలాంటి నిర్మాణపనులు చేపట్టరాదనే నిబంధల్ని ఉల్లంఘించిన రియల్టర్లు.. పేదల పేరుతో గుడిసెలు వేసి కొట్టేయాలని ప్రయత్నించారు. ఖాళీ చేయాలని రెండు నెలల సమయం ఇచ్చిన హైడ్రా .. హద్దులు నిర్ధారించి ఇవాళ ఫెన్సింగ్ వేస్తోంది. చెరువు మధ్యలో వేసిన కట్టను తొలగించింది.

కార్పొరేట్ విద్యకు దీటుగా గురుకులాలు : మంత్రి అడ్లూరి

విశ్వంభర, తెలంగాణ బ్యూరో : విద్యను ఖర్చుగా కాకుండా భవిష్యత్ తరాలపై చేసే విలువైన పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల ప్రగతికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో శనివారం నిర్వహించిన 'అకాడమిక్ సక్సెస్ మీట్ 2026'లో మంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణ గిరిజన గురుకులాలు కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని ప్రశంసించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 98.86 శాతం, ఇంటర్‌లో 86.53 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. ధర్మపురిలో గిరిజన బాలికల కోసం 6వ తరగతి నుంచి డిగ్రీ వరకు సైనిక్ స్కూల్, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే ఆమోదం లభిస్తుందని తెలిపారు. గురుకులాల మరమ్మతులు, నిర్వహణ కోసం రూ.72.83 కోట్లు, ఆధునిక మాడ్యులర్ కిచెన్ల కోసం రూ.25 కోట్లు కేటాయించామని, అన్ని సంస్థలకు 'ఈట్ రైట్' సర్టిఫికేషన్ లభించిందని మంత్రి తెలిపారు. పోస్ట్ మ్యాట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.565.32 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను సత్కరించి, నగదు పురస్కారాలు, మెమెంటోలు అందజేశారు.

బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

విశ్వంభర, హైదరాబాద్: సింగరేణి కార్యాలయాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ నమోదైన కేసులో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్‌కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. సింగరేణి అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు.. శనివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ వద్ద బాల్క సుమన్ అరెస్టు చేశారు. అనంతరం ఆరున్నర గంటలపాటు విచారించారు. వైద్య పరీక్షల అనంతరం కోర్టు ముందు ప్రవేశ పెట్టగా, జడ్జి రిమాండ్ విధించారు.

సింగిల్ విండో చైర్మన్లను కొనసాగించాలని గవర్నర్‌కు సిరికొండ మధుసూదనాచారి విజ్ఞప్తి

విశ్వంభర, హైదరాబాద్ : సింగిల్ విండో చైర్మన్లను కొనసాగించాలని కోరుతూ శనివారము లోక్ భవన్ లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ని కలిసి వినతి పత్రం అందజేసిన శాసన మండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, సహకార సంఘాల చైర్మన్లు.ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా సహకార సంఘాల్లో నామినేటెడ్ వ్యక్తులను నియమించాలని చూస్తోంది అని ఇది సహకార సంఘాల చట్టానికి విరుద్ధం అని అన్నారు. 2020లో గెలిచిన చైర్మన్లు పదవీకాలం 2025 వరకు ఉంది. ఎన్నికలు జరపకుండా తమకు అనుకూలంగా ఉన్న వారిని నామినేట్ చేయాలని చూస్తోంది అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇవ్వాలని గవర్నర్ను కోరడం జరిగిందని తెలిపారు.ఈ విషయంలో గవర్నర్ సానుకూలంగా స్పందించారు అని అన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి పై కర్రలతో దాడి

విశ్వంభర, భూదాన్ పోచంపల్లి : భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని వ్యూహాత్మకంగా రప్పించి నలుగురు వ్యక్తులు కర్రలతో విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. బాధితుడు గుత్తి బాలశంకర్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 29న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పక్క బజార్‌లో ఉండే కంటే మల్లేష్ అనే వ్యక్తి తనకు ఫోన్ చేసి చిన్న పని ఉందని ఇంటికి రమ్మన్నాడు. అతని మాటలు నమ్మిన బాలశంకర్ కారులో ఒంటరిగా అక్కడికి వెళ్లగా, బబ్లు, కన్నె రాజు, కన్నె బన్నిలు ఎదురుచూస్తూ ఉన్నారు. బాలశంకర్ అక్కడికి చేరుకోగానే కారు డోర్ తెరిచి బయటకు లాగి, చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొన్నారు. అంతటితో ఆగకుండా నలుగురు కలిసి కర్రలతో, చేతులతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో బాలశంకర్ ముఖంపై, కన్ను భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. అంతేకాకుండా, నిన్ను వదిలిపెట్టం.. చంపేస్తాం అంటూ బెదిరించినట్లు బాధితుడు తెలిపాడు. ఆ సమయంలో అరుపులు, కేకలు విన్న అశ్విన్ అనే స్థానికుడు ఘటనాస్థలికి చేరుకుని అతడిని రక్షించాడు. తన పై దాడి చేసిన నలుగురిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గుత్తి బాలశంకర్ తెలిపారు.